సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



దివ్యాంగుల సంక్షేమానికి కృషి

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నట్టు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. 8లో



ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి

రంపచోడవరంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్టు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. 8లో



కుస్తీ పోటీలకు 50 మంది..

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు 50 మంది బాల బాలికలు ఎంపికయ్యారు. కొయ్యూరులో ఎంపిక పోటీలు నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్ కాపునేస్తంతో 1510 మందికి లబ్ధి

- ఖాతాల్లో రూ.2 కోట్ల 26 లక్షల 50 వేలు జమ
- జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్



వైఎస్సార్ కాపునేస్తం లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న జేసీ శివశ్రీనివాస్

సాక్షి,పాడేరు: వైఎస్సార్ కాపునేస్తం పథకంలో 1510 మందికి లబ్ధి చేకూరిందని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో శనివారం వైఎస్సార్ కాపునేస్తం నాలుగో విడత ఆర్థికసాయాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్‌లో అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వారి ఖాతాల్లో రూ.2కోట్ల 26లక్షల 50వేలు చేసిందని వెల్లడించారు. వైఎస్సార్ కాపునేస్తంలో లబ్ధిపొందిన వారంతా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును ఆయన పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ మురళి, బీసీ కార్పొరేషన్ ఏఈవో శంకరరావు పాల్గొన్నారు.

మోదమ్మ విగ్రహాన్ని తాకిన సూర్య కిరణాలు



సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మ తల్లి విగ్రహాన్ని శనివారం ఉదయం 5.45 గంటలకు సూర్యకిరణాలు తాకాయి. ఈ విషయాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రమణ్యం తెలిపారు. ఈ అద్భుత దృశ్యాన్ని భక్తులు వీక్షించారు.

వైద్య నిర్ధారణ పరీక్షలు వేగవంతం

- ఐటీడీఏ పీవో అభిషేక్
- మైక్రోస్కోప్‌ల పంపిణీ



మైక్రోస్కోప్‌ను అందజేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. ఐటీడీఏ నిధులతో కొనుగోలు చేసిన ఐదు మైక్రో స్కోప్‌లను శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లకు అందజేశారు. పెదబయలు, తాజంగి, ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు అరకువ్యాలీ సహాయ మలేరియా అధికారి కార్యాలయానికి, జిల్లా మలేరియా అధికారి కార్యాలయానికి ఐదు మైక్రో స్కోప్‌లను కేటాయించారు. మలేరియా, క్షయ, మూత్ర పరీక్షలు, వీర్య కణాల పరీక్షలు చేసేందుకు ఈ యంత్రాలను ఉపయోగించి రోగులకు సకాలంలో రిపోర్టులు అందజేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ రక్త నిర్ధారణ పరీక్షలు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఆహ్లాదం..ఆదమరిస్తే ప్రమాదం

కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు జలపాతాల అందాలు మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. వీటిని తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్నారు. సందర్శనన సమయంలో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

- మృత్యు కుహరాలుగా జలపాతాలు
- జాగ్రత్తలు పాటించని సందర్శకులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టని వైనం



డుడుమ జలపాతం వద్ద గల్లంతైన వారి కోసం గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం (ఫైల్)



డుడుమ జలపాతం వద్ద ప్రమాదకర ప్రదేశం

ముంచంగిపుట్టు: మన్యం అందాలను తనివితీరా చూసేందుకు దేశ,విదేశాల నుంచి భారీ సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. జలపాతాలను సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలమీదకు తెచ్చుకున్నట్టే.

- మండలంలోని ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో ఉన్న డుడుమ జలపాతం పరిసరాలు ప్రకృతి అందాలకు నిలయం. సుమారు 556 అడుగుల ఎత్తునుంచి జాలువారుతుండటంతో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. అయితే ఈ ప్రాంతానికి వెళ్లడం సాహసంతో కూడుకున్నదే. సుమారు 800 మెట్లు దిగాలి. జలపాతం దిగువ భాగంలో నీటి ప్రవాహంతో రాళ్లు కోతకు గురై సొరంగాలు ఏర్పాడ్డాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్లే. ఇప్పటికే చాలామంది ప్రాణాలు కోల్పోయారు.
- మండలంలోని తారబు, జడిగూడ,బురదగుంట, హంసబంద జలపాతాల వద్ద ప్రమాదకర పరిస్థితులు పొంచి ఉన్నాయి.
- అనంతగిరి మండలంలో సరియా, కటికి, తాటిగుడ, డుంబ్రిగుడ మండలంలో చాపరాయి,అరకులోయలో రణజిల్లెడ, జి.మాడుగులలో కొత్తపల్లి, పెదబయలులో పిట్టలబొర్ర,తారబు, చింతపల్లి మండలం లంబసింగి సమీపంలో రావిమాను పాకలు, గాదిగుమ్మి తదితర జలపాతాలు ఉన్నాయి. వీటివద్ద కూడా ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి.

హెచ్చరిక బోర్డులున్నా..

ప్రభుత్వం, పర్యాటక శాఖ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు లెక్కచేయకుండా ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు. విహారం కాస్త విషాదంగా మారి కుటుంబాలకు తీవ్ర రోదన మిగుల్చుతున్నాయి.

మృత్యు ఒడిలోకి ఇలా..

ఉధృతంగా ప్రవహిస్తున్న జలపాతాల లోతు తెలియకపోవడం వల్ల స్నానాలకు దిగి ప్రమాదాలకు గురవుతున్నా.

- ఎత్తయిన బండరాళ్లపై నిలబడి జలపాతాల వద్ద ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. నాచుతో ఉన్నదున పట్టుతప్పి ప్రమాదాలకు గురై ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.
- ఈత వస్తే తప్ప జలపాతాల్లో దిగేందుకు ఏమాత్రం సాహసించవద్దని అధికారులు హెచ్చరిస్తున్నా లక్ష్య పెట్టడం లేదు.
- మద్యం మత్తులో కూడా జలపాతాల్లోకి దిగి ప్రమాదాలకు గురవుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

డుడుమ జలపాతం వద్ద ప్రమాదాల నివారణకు ఒడిశా అధికారులతో చర్చించాం. దీంతో వారు సెక్యూరిటీ గార్డును నియమించారు.ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశాం. స్నానం చేసేందుకు జలపాతాల్లో దిగి గల్లంతైన సందర్భాలు ఉన్నాయి. పర్యాటకులు జలపాతాల్లోకి దిగేందుకు సాహసించకూడదు. – నర్సమ్మ, తహసీల్దార్, ముంచంగిపుట్టు

ప్రతి ఒక్కరికీ జగనన్న ఆరోగ్య సురక్ష

- జిల్లాలో 11 మండలాల్లో సర్వే ప్రారంభం
- రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రమేష్‌బాబు



పురుగుడిపుట్టులో ఇంటింటా సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రమేష్‌బాబు



పురుడిపుట్టులో రక్తపరీక్షలను పరిశీలిస్తున్న రమేష్‌బాబు, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పెదబయలు: జిల్లాలోని 11 మండలాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభమైందని పథకం రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రమేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మండలంలోని అరడకోట, అడుగులపుట్టు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలోని అరడకోట, పురుగుడిపుట్టు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో జమాల్‌బాషాతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలు, ఫ్యామిలీ డాక్టర్‌పై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. కుటుంబంలో ప్రతిఒక్కరికీ వైద్యపరీక్షలు చేసి వివరాలు నమోదు చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 22 మండలాల్లో చింతూరు, ఎటిపాక, రంపచోడవరం, అరకులోయ, డుంబ్రిగుడ, పెదబయలు, జీకే వీధి, దేవీపట్నం, గంగవరం, మారేడుమిల్లి, వై.రామవరం మండలాల పరిధిలో సర్వే ప్రారంభమైందన్నారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, కంటి తదితర ఇతర ఆరోగ్య పరీక్షలు చేస్తారన్నారు. గుర్తించిన వ్యాధుల తీవ్రతను బట్టి వైద్యసేవల పరంగా తదుపరి చర్యలు తీసుకుంటారన్నారు. సర్వే వివరాలు ప్రత్యేక యాప్‌లో వివరాలు పొందుపరుస్తారన్నారు. జిల్లాలో 45 రోజులపాటు గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు. ఈ నెల 30 తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది సక్రమంగా సర్వే నిర్వహించాలన్నారు. గ్రామంలో ఏ ఒక్కరూ మిస్‌కాకుండా కవర్ చేయాల్సి ఉందని సిబ్బందికి సూచించారు. సర్వేకు సంబంధించి ముందుగానే గ్రామ వలంటీర్, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు. సర్వేకు ఈ మీ గ్రామానికి వస్తున్నామని గ్రామ వలంటీర్, ఆశా, అంగనవాడీల ద్వారా ముందు రోజు సమాచారం అందించి అందురూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. డిప్యూటీ గణాంక అధికారి కైలాస్, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా నోస్కూల్ బ్యాగ్ డే

గంగవరం : మండలంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన నో స్కూల్ బ్యాగ్ డే కార్యక్రమాల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిత్ర లేఖనం, మట్టితో గణపతి ప్రతిమలు, బొమ్మలు, అక్షర మాలలు తయారు చేశారు.



చిన్నారులు తయారు చేసిన అక్షరమాల, బొమ్మలు

మట్టి విగ్రహం.. గట్టి సంకల్పం

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన 'చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి' కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. పాడేరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో శనివారం జరిగిన కార్యక్రమాన్ని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ప్రారంభించారు.

- 'చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి' కార్యక్రమానికి విశేష స్పందన
- 'సాక్షి' మీడియా గ్రూప్, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహణ

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP



మట్టిగణపతి విగ్రహాల తయారీలో నిమగ్నమైన విద్యార్థులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, పక్కన జీసీడీవో సూర్యకుమారి, ఏటీడబ్ల్యూవో రజని, ప్రిన్సిపాళ్లు సింహాచలంనాయుడు, రమాదేవి, చంద్రకళ

సాక్షి పాడేరు/పాడేరు రూరల్/హుకుంపేట : పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరు రసాయనాల వినియోగానికి దూరంగా ఉండాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. జ్యోతి ప్రజ్వలన చేసి 'చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి' కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. పాడేరు ప్రాంతంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు 150 మందికి పైగా ఇందులో పాల్గొన్నారు. ఐటీడీఏ పీవో సర్వశిక్ష జీసీడీవో కె. సూర్యకుమారి, పాడేరు ఏటీడబ్ల్యూవో రజని, హుకుంపేట, పాడేరు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, సీహెచ్ రమాదేవి అతిథులుగా విచ్చేశారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి నిక్కుల చంద్రకళ అతిథులను ఆహ్వానించారు.

శుభపరిణామం

మట్టి విగ్రహాల తయారీ పోటీలను నిర్వహించడం శుభ పరిణామనని ఐటీడీఏ పీవో అభిషేక్ పేర్కొన్నారు. వినాయక చవితి పండగ పిల్లల సందడితోనే జరుగుతుందని, వారితోనే మట్టి ప్రతిమలు చేయించి పూజించే విధంగా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన పదార్థాలతో తయారు చేసిన గణనాథుని విగ్రహాలను వినియోగించడం ద్వారా అనేక అనర్థాలు ఉంటాయన్నారు. నీటి కాలుష్యం పెరిగిపోతుందని ఆ ప్రభావంతో తాగునీటి వనరులు కూడా కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. రసాయనాలతో విగ్రహాలు తయారు చేయకూడదని గతంలోమద్రాస్ కోర్టు తీర్పునిచ్చిందన్నారు. ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాల్లో ప్రజలంతా మట్టి గణనాథుని విగ్రహాలతోనే పూజలు జరుపుకోవాలన్నారు.

అతిథులిలా..

- మట్టి విగ్రహాలను చవితి పూజలకు వినియోగించేలా విద్యార్థులంతా తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాలని ఏటీడబ్ల్యూవో ఎల్.రజని కోరారు.
- విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై అవగాహన కల్పించేలా మట్టి విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొట్టగుళ్లి సింహాచలం నాయుడు అన్నారు.
- జిల్లాలోని అన్ని కేజీబీవీ పాఠశాలల్లో మట్టి గణనాథుని ప్రతిమల తయారీ, వినియోగంపై చైతన్యం తీసుకువచ్చామని జీసీడీవో కె.సూర్యకుమారి అన్నారు. మట్టి ప్రతిమల తయారీ పోటీలు నిర్వహించడం మరింత మేలు జరుగుతుందన్నారు.

విశేష స్పందన : కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన 'మీ చిట్టి చేతుల్లోనే మట్టి గణపతి తయారు చేయండి ఇలా' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు తరలివచ్చారు. పోటాపోటీగా గణనాథుని ప్రతిమలను తయారు చేశారు. న్యాయనిర్ణేతలుగా జీసీడీవో సూర్యకుమారి, పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. రమాదేవి, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి నిక్కుల చంద్రకళ వ్యవహరించారు.

విజేతలు వీరే

- కేజీబీవీ పాఠశాలకు చెందిన ఎం. అలేఖ్య తయారు చేసిన ప్రతిమకు మొదటి స్థానం, శ్రీ అక్షర పాఠశాలకు చెందిన భవ్య తయారు చేసిన ప్రతిమకు ద్వితీయ స్థానం, లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన సింహాద్రి తయారు చేసిన ప్రతిమకు తృతీయ స్థానం లభించింది.
- కేజీబీవీ విద్యార్థిని రూపావతి, మోదమాంబ పాఠశాల విద్యార్థులు గణశ్యామ్, భాస్కర్, గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలు, లోచలిపుట్టు ఆశ్రమ పాఠశాలకు చెందిన భరత్, శ్రీ అక్షర ఉన్నత పాఠశాలకు చెందిన భార్గవి, శ్రీకృష్ణాపురం పాఠశాలకు చెందిన ఎస్. స్మైలీకి కన్సోలేషన్ బహుమతులు సాధించారు. వీరందరికీ సాక్షి మీడియా గ్రూప్, కాలుష్య నియంత్రణ మండలి సమకూర్చిన గిఫ్ట్ ప్యాక్‌లను ఏటీడబ్ల్యూవో ఎల్. రజని, జీసీడీవో సూర్యకుమారి, ప్రిన్సిపాళ్లు సింహాచలం నాయుడు, రమాదేవి, చంద్రకళ అందజేశారు.
- మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందించి వారి కళాశాలల తర పున హుకుంపేట, పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు కూడా వినాయక ప్రతిమలతో కూడిన సిల్వ ర్ షీల్డులను బహూకరించారు. వర్తక సంఘ నేతలు ఉప్పల వెంకట రత్నం, కొట్టగుళ్లి రామారావు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

మట్టి ప్రతిమలతో సమాజానికి మేలు



తమ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ లక్ష్యంగా మట్టి గణపతి ప్రతిమల తయారీ పోటీలను నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉంది. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి,సాక్షి మీడియా గ్రూప్ సంయుక్తంగా సమాజానికి మేలు చేసే మంచి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం. – నిక్కుల చంద్రకళ, ప్రత్యేకాధికారి, కేజీబీవీ పాఠశాల, పాడేరు



ప్రథమ బహుమతి పొందిన ప్రతిమతో అలేఖ్య



ద్వితీయ బహుమతి సాధించిన గణపతి ప్రతిమతో భవ్య



తృతీయ బహుమతి పొందిన గణపతి ప్రతిమతో సింహాద్రి



తాము తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలతో విద్యార్థులు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని సామూహిక వ్రతాలు


సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

చింతూరు: అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ధర ప్రచార మాసోత్సవాలు-2023 సందర్భంగా శనివారం స్థానిక కనకదుర్గ దేవాలయంలో సత్యదేవుని సామూహిక ఉచిత వ్రతాలు నిర్వహించారు. అడ్డతీగల తణుకు వెంకటరామయ్య పవనగిరి స్వామి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 150 మంది దంపతులు పాల్గొన్నారు. వ్రత సామగ్రిని అన్నవరం దేవస్థానం సమకూర్చింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు, సూపరింటెండెంట్ కేవీవీఎస్ మూర్తి, అర్చకులు వీర్రాజు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో నిధుల దుర్వినియోగం

- అంజలి శనివారం గురుకులం గత ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసు
- గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు


నాడు- నేడు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీడీ కొండలరావు

చింతపల్లి రూరల్: మండలంలో అంజలి శనివారం మినీ గురుకుల పాఠశాలలో నాడు-నేడు పనుల్లో నిధుల దుర్వినియోగంపై విచారణ నిర్వహించామని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు తెలిపారు. శనివారం ఆయన అంజలిశనివారం మినీ గురుకులంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడులో పాఠశాలకు రూ.15 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులు అసంపూర్తిగా పనులు చేపట్టి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు గుర్తించామన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసు ఇస్తామని తెలిపారు. జాజులపాలెం బాలురు ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన సూచనలు చేశారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- 75 మంది దివ్యాంగులకు యంత్ర పరికరాల పంపిణీ


దివ్యాంగ చిన్నారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్

చింతపల్లి: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దా పీపుల్స్ ఏబిలిటీ ఆధ్వర్యంలో 75 మంది దివ్యాంగులకు యంత్ర పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలు పంపిణీ చేసేందుకు గతంలోనే కలెక్టర్ సుమిత్‌కుమార్, చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదరం శిబిరంలో అర్హులను గుర్తించినట్టు చెప్పారు. ఈ మేరకు వారికి అవసరమైన పరికరాలను సమకూర్చి పంపిణీ చేసినట్టు ఆమె వివరించారు. ఈ మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన దా పీపుల్స్ ఏబిలిటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ పాత్రోను అభినందించి సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూషదేవి, జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఎంపీడీవో ఆశాజ్యోతి, సర్పంచ్ దురియా పుష్పలత, సీఐ రమేష్, వైస్ ఎంపీపీ వెంగళరావు, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, డాక్టర్ మోనాలిసా, సర్పంచులు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా


సిబ్బంది రాకపోవడంతో ఖాళీగా కుర్చీలు


వనుగుమ్మ సచివాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు

- ఇబ్బందులు పడిన గిరిజనులు
- ఎంపీడీవోకు ఫిర్యాదు

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ గ్రామ సచివాలయ సిబ్బంది శనివారం విధులకు హాజరు కానందున గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. జగనన్న చేదోడు పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు పలు గ్రామాల నుంచి వచ్చారు. శనివారం రోజు చివరి రోజు కావడం, సచివాలయంలో సిబ్బంది విధులకు రాకపోవడంతో వారంతా ఆందోళనకు దిగారు. తరచూ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, ఫోన్ చేస్తే ఫీల్డ్‌లో ఉన్నామంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విధులకు సక్రమంగా హాజరు కాని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వనుగుమ్మ ఉప సర్పంచ్ సీతారాం, మాజీ వార్డు మెంబర్ చెండల్ తదితరులు డిమాండ్ చేశారు. సిబ్బంది విధులకు హాజరుకాకపోవడాన్ని వారు ఫోన్లో ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయనను వివరణ కోరగా రెండు రోజులు సెలవులు కావడంతో మంగళవారం వనుగుమ్మ వెళ్లి విచారణ నిర్వహిస్తామని చెప్పారు. సిబ్బంది అందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

రెగ్యులేటరీ డ్యాం నీరు వృథా

గేట్లలో సాంకేతిక లోపం


వృథాగా పోతున్న నీరు

సీలేరు: గుంటవాడ జలాశయం నుంచి రెగ్యులేటరీ డ్యాం ద్వారా జల విద్యుత్ కేంద్రానికి నీటిని సరఫరా చేసే క్రమంలో మధ్యలో ఉండే ఎంబార్క్‌మెంట్ నుంచి నీరు వృథాగా పోతోంది. రెగ్యులేటర్ డ్యాం 2, 5 గేట్లు మరమ్మతుకు గురవడంతో జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి నిలిపివేశారు. దీంతో డ్యామ్ గేట్లు పనిచేయకపోవడం వల్ల శుక్రవారం మధ్యాహ్నం నుంచి వృథాగా పోవడాన్ని అధికారులు గుర్తించారు. శనివారం ఉదయం వాటిని కిందకు దించేందుకు ప్రయత్నించారు. ఇలావుండగా సీలేరు విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో సాంకేతిక లోపం తలెత్తి రెండో నంబరు యూనిట్ నిలిచిపోయింది. డివిజనల్ ఇంజినీరు లక్ష్మీనారాయణ, ఇంజనీర్లు, కార్మికులు హైడ్రోలిక్ ఆయిల్ పంపులో సాంకేతిక లోపం గుర్తించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి యూనిట్‌ను వినియోగంలోకి తీసుకొచ్చారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి

రంపచోడవరం: రంపచోడవరంలో త్వరలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్టు స్థానిక ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే వెల్లడించారు. రంపచోడవరంలో ఏర్పాటు చేసిన స్టార్ బ్యాడ్మింటన్ అకాడమీని శనివారం ఆయన ఏఎస్పీ జగదీష్ అడహళ్లితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ స్థానికంగా ఇలాంటి అకాడమీతో పాటు కోర్టు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను అభినందించారు. అకాడమి సభ్యులు నాగేంద్ర, సురేష్, ప్రదీప్, కళ్యాణ్, దినకరన్, నిశాంత్, అభిషేక్ పాల్గొన్నారు.

కుస్తీ పోటీలకు 50 మంది..


పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రమేష్

కొయ్యూరు: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు 50 మంది బాలబాలికలు ఎంపికయ్యారు. స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల-1 కుస్తీ అకాడమిలో శనివారం అల్లూరి, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన వారికి ఇక్కడ కుస్తీ పోటీలను నిర్వహించారు. 76 మంది బాలికలు,74 మంది బాలురు పాల్గొన్నారు. ఒక్క కొయ్యూరుకు చెందిన 25 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపీపీ బడుగు రమేష్ పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు కూడా దేశానికి, సొంత గ్రామానికి పేరు తీసుకువస్తాయన్నారు. కుస్తీ కోచ్ అంబటి నూకరాజు మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 23 వరకు ఎన్టీఆర్ జిల్లాలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారన్నారు. కొయ్యూరు ఆకాడమి నుంచి 13 మంది బాలికలు, 12 మంది బాలురు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. సర్పంచ్ మాకాడ బాలరాజు, హెచ్‌ఎం మూర్తి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యకుమారి


గర్భిణులు, బాలింతలకు సూచనలిస్తున్న పీడీ సూర్యకుమారి

గూడెంకొత్తవీధి: బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యకుమారి సూచించారు. ఆమె శనివారం మండలంలో పర్యటించారు. రింతాడలో ఉపపాలం, పెదవలస అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. స్టాక్‌ను పరిశీలించారు. కేంద్రంలో నిర్వహిస్తున్న పౌష్టికాహార మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పుడు ప్రభుత్వం టేక్‌హోం రేషన్(టీహెచ్ఆర్) నేరుగా లబ్ధిదారుల వద్దకు వచ్చి ఇస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. పౌష్టికాహారం ద్వారా రక్తహీనత నివారించవచ్చన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు బాలింతలు, గర్భిణులకు ఇస్తున్న పోషకాహారంపై పర్యవేక్షించాలని సూచించారు. అదే విధంగా పిల్లలకు బేసిక్స్ బోధన చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎత్తు, బరువులను ప్రతీ నెల కొలవాలన్నారు. సీడీపీవో లక్ష్మీదేవి, సూపర్‌వైజర్ వలసమ్మ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేస్తే తప్పనిసరిగా గుర్తింపు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ నాయకులు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తే తప్పనిసరిగా ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతం కోసం సమష్టిగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో కార్యకర్తలు పర్యటించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే తప్పకుండా అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల నుంచి అరకులోయ మండల పార్టీ అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీకు కొర్రా గాసి అందించిన సేవలు అభినందనీయమన్నారు. పార్టీకు చేసిన సేవలను గుర్తించి అధిష్టానం జిల్లా కమిటీలో ఆయనకు స్థానం కల్పించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఎంపీపీ ఉషారాణి, పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న, ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, నాయకులు సూరయ్య, సాంబ, గోపాల్, నర్సింగ్, నగేష్, లక్ష్మణ్, గురుమూర్తి, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు


వెంకట గణేష్

వై.రామవరం: విద్యార్థి అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం సంతోష్ కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అడ్డతీగల మండలం దాకోడు పంచాయతీ జాజిపాలెం గ్రామానికి చెందిన జనుమూరి వెంకటగణేష్ (14) మండలంలోని పనసలపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 11వ తేదీ ఉదయం 9.30 గంటలకు పాఠశాల నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గాలించినా ఆచూకీ లభ్యం కానందున శనివారం పాఠశాల హెచ్‌ఎం అప్పలనాయుడు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. విద్యార్థి ఆచూకీ తెలిసిన వారు 9440904861, 9599499366, 9490957247, 9182106171 నంబర్లకు తెలియజేయాలని ఆయన కోరారు.